ప్రజాశక్తి

శనివారం 22 ఏప్రిల్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా

వేతన వెతలు

- 42 మంది విఆర్‌ఎలకు అందని జీతాలు
- గుడివాడ సబ్ ట్రెజరీలో మెలిక

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: గుడివాడ సబ్ ట్రెజరీ కార్యాలయ అధికారులు చిరుద్యోగుల జీతాలను వారి ఖాతాల్లో జమ చేయకుండా నిలిపివేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు (విఆర్‌ఒలు)గా ఉద్యోగోన్నతి పొందిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్‌ఎ)లకు సంబంధించి డిఎ రికవరీకి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చిన తర్వాతే జీతాలు జమ చేస్తామని సబ్ ట్రెజరీ అధికారులు మెలిక పెడుతున్నారు. దీంతో ఏప్రిల్ 20వ తేదీ వచ్చినా మార్చినెల వేతనాలు చిరుద్యోగులకు అందలేదు. ఒకటో తేదీన పడాల్సిన జీతాలు ఆలస్యం అవ్వడంతో అరకొర వేతనాలు, అప్పులతో రోజులు నెట్టుకొచ్చే విఆర్‌ఎలు ఆందోళన చెందుతున్నారు. 2019లో అప్పటి ప్రభుత్వం విఆర్‌ఎలకు డిఎ నెలకు రూ.300 పెంచింది. 32 నెలలపాటు జీతంతోపాటు పెరిగిన డిఎ విఆర్‌ఎల ఖాతాల్లో జమైంది. ఇలా ఖాతాల్లో జమ అయిన డిఎని వైసిపి ప్రభుత్వం రికవరీ చేసింది. గుడివాడ సబ్ ట్రెజరీ పరిధిలో 42 మంది విఆర్‌ల నుండీ రికవరీ చేసింది. ఒకొక్కరూ సగటున రూ 9,800 తిరిగి చెల్లించారు. ఈ ట్రెజరీ పరిధిలో విఆర్‌ఎల నుండి విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి పొందిన 12 మంది వేతన చెల్లింపులకు సంబందించి సబ్ ట్రెజరీ హెడ్ మారింది. వీరి నుండి డిఎ రికవరీ చేయడానికి వీలుపడలేదు. ఉద్యోగోన్నతి పొందిన వారి నుండి డిఎ పూర్తిస్థాయి రికవరీకి రెవెన్యూ ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసిన తర్వాతే విఆర్‌ఎలకు జీతాలు చెల్లిస్తామని ట్రెజరీ అధికారులు మెలిక పెట్టారు. మార్చి నెల జీతాన్ని వారి ఖాతాల్లో జమ చేయకుండా నిలిపివేశారు.

ఎలా బతకాలి ?

రెవెన్యూ సేవల్లో విఆర్‌ఎలు కీలకంగా మారారు. పార్ట్ టైం వర్కర్లుగా చెబుతున్నా వీరు ఫుల్ టైమ్ పని చేయాల్సిన పరిస్థితి ఉంది. ఒక్కో విఆర్‌ఎకు ప్రభుత్వం గౌరవ వేతనంగా నెలకు రూ.10,450 మాత్రమే చెల్లిస్తోంది. ఈ అరకొర వేతనంతోనే వీరి కుటుంబాలు నెల రోజులు నెట్టుకు రావాలి. ప్రతి నెలా రెండు మూడు తేదీల్లో జీతాలను ట్రెజరీ అధికారుల ఆంక్షలతో ఏప్రిల్ 20 తేదీ వచ్చినా జమ కాలేదు. జీతాలు సకాలంలో ఇవ్వకుండా ఎలా బతకాలని విఆర్‌ఎలు వాపోతున్నారు. వెంటనే జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

గన్నవరంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నాయకులు

బిజెపిని సాగనంపుదాం

- సిపిఎం, సిపిఐ నాయకులు వై.నరసింహారావు, కెవివిఎస్ ప్రసాద్
- రేపు గన్నవరంలో బహిరంగ సభకు బి.వి.రాఘవులు, రామకృష్ణ హాజరు

ప్రజాశక్తి-గన్నవరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను సైతం ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో దానిని సాగనంపేందుకు అందరూ కృషిచేయాలని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం గన్నవరంలో వామపక్షాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 23వ తేదీన గన్నవరం మూడు బొమ్మల సెంటర్లో జరిగే బహిరంగ సభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపైన, పాత గన్నవరం శ్రీనగర్ కాలనీ రాయ నగర్ ఏరియాలో ర్యాలీగా వెళ్లారు. బిజెపి ఓటమితోనే దేశానికి మనుగడ ఉంటుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సిపిఐ జిల్లా నాయకులు కెవివి ఎన్. ప్రసాద్ అన్నారు. దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఇభజన హామీల అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, కార్పొరేట్ దోపిడీకి చెల్లుచీటి, రాష్ట్ర అభివృద్ధి, సామాన్య ప్రజల రక్షణే ప్రధాన కర్తవ్యం తదితర డిమాండ్లతో జిల్లా వ్యాప్తంగా ప్రచార సభలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద వాసుదేవరావు, వామపక్షాల నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కళ్ళం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరావు, కాట్రగడ్డ జోషి, ముక్కామల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు గన్నవరంలో బహిరంగ సభ

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి, దేశాన్ని కాపాడాలి అనే నినాదంతో ప్రచారభేరీ యాత్రల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు గన్నవరం మూడు బొమ్మల సెంటర్‌లో బహిరంగ సభ ఏర్పాటుచేశారు. ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రసంగిస్తారని నాయకులు పేర్కొన్నారు.

30 నెలల్లో బందరు పోర్టు నిర్మాణం పూర్తి

అభివృద్ధి పనుల పరిశీలనలో కలెక్టర్ పి.రాజబాబు వెల్లడి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మే నెలలో ముఖ్యమంత్రి మచిలీపట్నం పోర్టు పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం 30 నెలల వ్యవధిలో నిర్మాణం పూర్తవుతుందని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ బందరు పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పోర్ట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. మొత్తం 1922 ఎకరాల్లో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులు గురించి ఆరా తీశారు. ముడ మాస్టర్ ప్లాన్ పరిశీలించి, చేపట్టాల్సిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మిత ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రేక్ వాటర్ ప్రాంతం, డ్రెడ్జింగ్ ప్రాంతం, అప్రోచ్ ఛానల్ ఏరియా వరకు వెళ్లి పరిశీలించారు. టర్నింగ్ సర్కిల్ ఏరియా, ప్రతిపాదిత పైలాన్ ఏరియా, పోర్టు నిర్మిత ప్రాంతం మార్కింగ్, బౌండరీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ బందరు పోర్టు నిర్మాణానికి అవసరమైన భారీ యంత్రాలు, మెటీరియల్ తరలించటానికి అనువుగా పోర్టు కనెక్టివిటీ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఈ పనులు ఇంకా వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి పోర్టు పనులు ప్రారంభించేందుకు అంగీకరించారన్నారు. దీంతో పోర్టు సన్నద్ధత పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి పోర్టు పనులకు భూమి పూజ నిర్వహించిన అనంతరం పోర్టు నిర్మాణ పనులు సమీపంలో బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. పైలాన్ నిర్మాణం, ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేసే ప్రాంతం, సభా వేదిక తదితర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. పోర్టు నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన భారీ యంత్రాలను నిర్మాణ సంస్థ ఇప్పటికే తరలించిందన్నారు. అనంతరం తవిసిపూడిలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఏపీ మ్యారీటైం బోర్డు ఎండి విద్యాశంకర్, ముడ విసి రాజ్యలక్ష్మి, మేఘా ఇంజనీరింగ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, రైట్స్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సూర్య, ఆర్డీవో ఐ కిషోర్, బందరు తహశీల్దార్ డి.సునీల్ బాబు, రైట్స్ సంస్థ ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.

విద్యా రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

కెబిఎన్ కళాశాల 50వ వార్షికోత్సవంలో మంత్రి జోగి రమేష్

వార్త 2లో

గిట్టుబాటు ధరకు మొక్కజొన్నను కొనుగోలు చేయాలి

● రైతు సంఘం నాయకులు డిమాండ్

ప్రజాశక్తి-మైలవరం : మొక్కజొన్నలను ప్రభుత్వం కల్పించిన గిట్టుబాటు ధరకే ఆర్బికే ల ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.స్థానిక ఏఎంసీ లో ఆరబోసిన మొక్కజొన్నలను శుక్రవారం రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. రైతులను వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నలను కొనుగోలు చేయకపోవడంతో రైతులు 1500 నుండి 1600కే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు.దీనితో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. ప్రారంభంలో 2300 ఉన్న ధర ను దళారులు కుమ్మక్కై మొక్కజొన్న ధరను అమాంతం తగ్గించేసారన్నారు. దళారును నివారించి ప్రభుత్వ ప్రకటించిన క్వింటాకు రూ.1962 మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రోజుల తరబడి మార్కెట్ యార్డ్ లోనే రైతులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, త్వరితగతిన రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నలను కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి,సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్,రైతు సంఘం నాయకులు మోహన్ రావు, చరణ్, దీపక్, శేషయ్య, ఐలు నాయక్, రమేష్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

మొక్కజోన్న పంటను పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి మైలవరం : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు అవ్వగా మరొకరు మతి చెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం తోలుకోడు రోడ్ లో శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన కలివెల నాగేశ్వరరావు (63) వేరో చోటకి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా తోలుకోడు గ్రామానికి చెందిన రామాల వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనంపై భార్య, కూతురుతో తోలుకోడు వెళుతున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నాగేశ్వరావు రోడ్డు మీద పడడంతో తలకు తీవ్ర గాయం అవ్వడంతో రక్తస్రావం అయింది. నాగేశ్వరావు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వరరావు భార్య సుజాతకు తీవ్ర గాయాల య్యాయి. సమాచారం అందుకున్న మైలవరం సిఐ మోహన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరువూరు : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి విద్యుత్ షాక్ గురై మృతి చెందటంతో మండలంలోని చింతలపాడులో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొపూరి విశ్వనాథం(34) ముగ్గురు సన్నిహితులతో కలిసి శుక్రవారం గ్రా మంలోని గుర్రపు వాగుకు చేపల వేట కు వెళ్లారు. వాగులో చేపలకోసం గాలాలు వేశారు. విశ్వనాథం గాలానికి చిక్కి న చేపను పైకి లేపుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగ అతనికి తగిలింది. దీనితో సహ కోల్పోయిన విశ్వనాథం ను పక్కనున్న స్నేహితులు గంపలగూడెంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తీసికెళ్లగా అప్పటికే కన్నుమూశాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి మతదే హాన్ని తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాతపాడులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్: విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) ఆధ్వర్యంలో ఏడురోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా విజయవాడ రూరల్ మండలం పాతపాడు జరుగుతున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పాతపాడు సర్పంచ్ దేవగిరి సుజాత ప్రారంభించారు. చిన అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి వివిధ విభాగాలకు చెందిన 15 మంది డాక్టర్లు, మరో 15 మంది సహాయక సిబ్బంది ఈ ఉచిత వైద్య శిబిరంలో సేవలందించారు. పాతపాడు, కుందావారి కండ్రిక, సీతారాంపురం, వెంకటాపురం గ్రామాల నుండి సుమారు 300 పైగా ఈ ప్రత్యేక శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్లు ఎదపూడి సుభాకర్, దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధార్థ లా కాలేజీ ఎన్ ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ పాండు రంగారావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి కంచికచర్ల : ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ కంచికచర్ల సమితి యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బి కిషోర్ కుమార్, ఎన్నికల పరిశీలకులు యం శ్రీనివాస్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అయితే ఒక్కొక్క పదవికి ఒకరు చొప్పున మాత్రమే నామినేషన్ దాఖలు చేయటంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కంచికచర్ల సమితి అధ్యక్షుడు గా ఆర్ సి హెచ్ పుల్లయ్య, ఉపాధ్యక్షులు గా బి రామ కష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి గా ఆర్ వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి గా కె శ్రీనివాసరావు, కోశాధికారి గా ఎం శిరిదేవమ్మ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా షేక్ మస్తాన్ రావు, ఆర్ గణేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు.

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. స్థానిక తెదేపా నేతలతో కలిసి ఇఫ్తార్ విందులో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. అనంతరం గ్రామ టిడిపి అధ్యక్షుడు మానుకొండ కష్ణారెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య రాకుండా చూడాలి : జెసి

ప్రజాశక్తి -నందిగామ : వేసవికాలంలో మంచినీటి ఎద్దడి నివారణకు అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించి ప్రజల దాహార్తి తీర్చాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం నందిగామ ఆర్డీవో కార్యాలయంను జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. నందిగామ తాసిల్దారు ఎస్ నరసింహారావును మండలం లో భౌగోళిక పరిస్థితులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు మంచినీటి సమస్య కోసం బాధపడకూడదని, తక్షణమే వారికి ట్యాంకుల ద్వారా మంచినీటి సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా రెవెన్యూ శిస్తు వసూళ్ళు రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలని కోరారు. జమాబంది రికార్డులు సక్రమంగా మైంటైన్ చేయాలని, రైతులు ఇబ్బంది పడకుండా వారికి సత్వరమే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో ఏ రవీందర్రావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల వైస్సార్ క్రాంతి పదం కార్యాలయం నందు డ్వాక్రా మహిళలకు మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా శ్రీనిధి, ఉన్నతి లింకేజీ రుణాల ద్వారా లబ్ధిదారులకు జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం గొర్రెలు పంపిణీ చేశారు .మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క యూనిట్ కి 6గొర్రెలు, ఇన్సూరెన్స్, మెడికల్ కిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణి, ఎంపీపీ రాబర్ట్ ,రెడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, రామినేని వీరాస్వామి నాయుడు, మండల సచివాలయల కన్వీనర్ ఉయ్యూరు భరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలంలోని చిట్యాల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజక వర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఇంతవరకు ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక టిడిపి పచ్చమీడియాను దుష్ప్రచారం చేస్తుందని విమర్శించారు. చంద్రబాబు కళ్ళబొల్లి మాటలు ఎవ్వరూ వినేవారులేరన్నారు. మారెళ్ళ అమ్మిరెడ్డి సత్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చిట్యాల వ్యవస్థాపకులు మారెళ్ళ పుల్లారెడ్డి బ్రదర్స్, గ్రామసర్పంచ్ జలా పెద్దకోటేశ్వ రరావు, ఎంపీటీసీ కొమ్మిరి చిన్నమ్మ, మండలపార్టీ అధ్యక్షులు వుట్లానాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి-కంచికచర్ల : జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల భూముల్లో స్టోన్ ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కంచికచర్ల మండలం పరిటాల రెవిన్యూ పరిధిలో రీ సర్వే పూర్తయింది. రైతుల భూముల్లో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ ను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం లో నందిగామ ఆర్డీవో ఏ, రవీంద్ర రావు,జిల్లా సర్వే అధికారి కె ,సూర్య రావు, నంది గామ డివిజనల్ సర్వే అధికారి, ఎన్,రవీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రంజాన్ మాసం సందర్భంగా విజయవాడ పార్లమెంటు టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గల ముస్లింలకు మాగల్లు గ్రామంలోని కేకే వద్ధాశ్రమం నందు 500 మందికి కుటుంబానికి సరిపోను నిత్యవసర సరుకులు శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ కరిముల్లా, మాజీ జెడ్పిటిసి సభ్యులు వాసిరెడ్డి ప్రసాద్, సీనియర్ న్యాయవాది కన్నెగంటి జీవరత్నం, ప్రముఖ వ్యాపారవేత్త నర్వనేని మురళి పాల్గొన్నారు.

మంచినీటి కూలర్ల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, రాష్ట్రం కు చంద్రబాబే భవిష్యత్ అని మాజీ ఎం పి, కష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణ అన్నారు.నారా లోకేష్ యువగళం పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గన్నవరం నియోజకవర్గంలో తెలుగు యువత రాష్ట్ర దేవినేని చంద్రశేఖర్ అధ్యక్షతన దేవినేని అపర్ణ, గన్నవరం తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి కొనకళ్ళ నారాయణ చేతులమీదుగా మంచినీటి కూలర్‌లు మసీదులు, చర్చిలకు పంపిణీ కార్యక్రమం రామవరప్పాడు రింగ్ లో శుక్రవారం జరిగింది. ప్రసాదంపాడు గ్రామ ఉపసర్పంచ్ గూడవల్లి నరసింహారావు, గ్రామ టీడీపీ నాయకులు బొప్పన హరికష్ణ, దివంగత నేత బచ్చుల అర్జునుడు కుమారుడు బచ్చుల బోసు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి మైలవరం : రెడ్ క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ సెక్రటరీ ట్రెజరర్ గూడూరు నాగిరెడ్డి కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి శివ హరిప్రసాద్ వెల్వడం సొసైటీ అధ్యక్షులు తోట తిరుపతిరావు తాసిల్దార్ కార్యాల సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- కంచికచర్ల** : వేసవిలో పాదచారులు, కూలీల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని గొట్టుముక్కల సర్పంచ్ తుల్లిమిల్లి రాజ్ కుమార్ అన్నారు. కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు చాగంటి రామారావు , టిడిపి నాయకులు గోగినేని శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

● కెబిఎన్ కళాశాల 50వ వార్షికోత్సవంలో మంత్రి జోగి రమేష్

మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-వన్‌టౌన్ : రాష్ట్రంలో విద్యారంగ వికాసానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర గహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల 58వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జోగి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలోనే తొలిసారిగా నూతన విద్యా విధానంలోని పలు అంశాలను అమలు చేయనున్నట్లు చెప్పారు. నాడు నేడు, అమ్మ ఒడి, విద్యా దీవెన తదితర అనేక పథకాలతో ప్రభుత్వ విద్యా సంస్థలకు నేటి అవసరాలకు ధీటుగా అధునాతన సౌకర్యాలతో తీర్చి దిద్దుతున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు అందించే దిశగా జగన్ ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలు పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. కేబీఎన్ కళాశాల 58 సంవత్సరాల ప్రస్థానం విజయవంతంగా కొనసాగించటం ఆనందాన్ని కలిగిస్తోందని అన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు టీ శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ఆవిష్కరణలను గమనంలో ఉంచుకొని విద్యార్థులను తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం రామిరెడ్డి, పారిశ్రామికవేత్త మద్ది రమేష్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు అధ్యక్షత వహించారు. కళాశాల సహాయ కార్యదర్శి జీవి రామారావు, కోశాధికారి అన్నం రామకష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతికాంశాలు విద్యార్థులను విశేషంగా అలరించాయి.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పెడన పట్టణం నడిబొడ్డులో విచ్చలవిడిగా పేకాట ఆడుతూ, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై అధికారులకు పిర్యాదు చేసిన బోనుల శ్రీనివాస్ అనే దళిత యువకుడిపై అక్రమంగా దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి ఖటినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కష్ణా జిల్లా కమిటీ అధ్యక్షులు సిహెచ్ రాజేష్ డిమాండ్ చేశారు.గాయపడి జిల్లా సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొనుల శ్రీనివాస్ ను శుక్రవారం కెవిపిఎస్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో పరామర్శించారు. దాడిని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తరుపున తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సి హెచ్ రాజేష్ మాట్లాడుతూ పెడన పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో కూడా యదేచ్ఛగా పేకాట నిర్వహణ దేనికి సంకేతమన్నారు. మంత్రి అండదండలతోనే పేకాట నిర్వహణలు జరుగుతున్నాయని ,అర్ధ రాత్రులు సైతం జనావాసాల మధ్య పేకాట శిబిరాలు నిర్వహిస్తున్న వారిని ప్రశ్నిచడం నేరమా? లేక మంత్రి ఇలాకాలో దళితులు ప్రశ్నించ కూడదా? అని ప్రశ్నించారు. పెడన పట్టణం లో అన్యాయాన్ని ప్రశ్నించిన దళితుడిని చితక బాది చావు దెబ్బలు కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక కౌన్సిలర్‌కు చెందిన సోదరుడు మరియు అతని అనుచరులు సుమారు 20 మంది కలిసి మూకుమ్మడి దాడి చేసి గాయపరిచారని, వారినుండి తనకు ప్రాణ హాని ఉందని తనకు రక్షణ కల్పించాలని బాధితుడు కోరుతున్నారని కాబట్టి ఆ విధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసును పక్కదోవ పట్టించేందుకు పలువురు ప్రయత్ని స్తున్నారని తనకు పూర్తి న్యాయం జరిగేవరకు అండగా ఉండాలని బాధితుడు కెవిపిఎస్ నాయకులను కోరాడు. రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నాయని చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ దోషులకు శిక్షలు పడటం లేదని ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న దాడులు జరుగుతున్నాయని ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే దళిత సంఘాలు ప్రజాతంత్ర వాదులు ఐక్యమైన రోజునే చట్టాలు అమలు జరుగుతాయని దీనికి కుల వక్ష వ్యతిరేక పోరాట సంఘం నిరంతరం కషి చేస్తుందని రాజేష్ స్పష్టం చేశారు. బాధితుడిని పరామర్శించిన వారిలో సిఐటియు మచిలీపట్నం అధ్యక్షులు బూరా సుబ్రహ్మణ్యం మచిలీపట్నం కెవిపిఎస్ కమిటీ సభ్యుడు పి. వేణు లు ఉన్నారు.

శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న కెవిపిఎస్ నాయకులు

మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

పెరిగిపోతున్న మట్టిమాఫియా ఆగడాలు : కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : అధికారమదంతో అన్యాయంగా వ్యవహరిస్తే ప్రజా తిరుగుబాటు తప్పదని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నియోజక వర్గంలో వైసీపీ భూబకాసురుల, మట్టి మాఫియా ఆగడాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయని కొల్లు రవీంద్ర ఆరోపించారు. శుక్రవారం స్థానిక శారదా నగర్ లోని మంగలేరు నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అధికార పార్టీ నాయకుల అండదండలతో వారి అనుచర గణం ట్రాక్టర్‌లపై మట్టి తరలిస్తుండగా వారిని అడ్డగించి ,రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేశామన్నారు. అయితే మట్టిమాఫియా తమపై దాడులు చేయడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందిం చకుంటే భవిష్యత్తులో జరిగే ప్రజా తిరుగుబాటుకు, తీవ్ర పరిణామాలకు ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పి.రాజాబాబును ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు శుక్రవారం ఆయన ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ కలెక్టర్ గా మొట్ట మొదటిసారి బాధ్యతలు కృష్ణా జిల్లాకు స్వీకరించటం హర్షణీయం అన్నారు. జిల్లాలో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సమాఖ్య పక్షాన జిల్లా పరిపాలనా అధికారికి నిర్మాణాత్మక సహకారం అందిస్తామని తెలిపారు. కలెక్టర్ ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కే నాగరాజు, మేడేపల్లి సుబ్బారావు, మేడేపల్లి సుబ్బారావు, మద్దాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించడమే సివిల్ సర్వెంట్ల లక్ష్యం

- కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : పరిపాలనా వ్యవస్థకు మూల స్థంబాలుగా వ్యవహరిస్తూ పౌరులకు ఉత్తమ సేవలు అందించడమే సివిల్ సర్వెంట్ల లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. శుక్రవారం జాతీయ పౌర సేవల దినోత్సవం (నేషనల్ సివిల్ సర్వీసెస్ డే) పురస్కరించుకుని స్పందన సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ డా. అపరాజితసింగ్తో కలసి అధికారులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులకు సేవ చేయడం కోసం సివిల్ సర్వెంట్లు తమను తాము తిరిగి అంకితం చేసుకునేందుకు, ప్రజాసేవ, పనిలో శ్రేష్టతను వారి కట్టుబాట్లను పునరుద్ధరించడానికి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న సివిల్ సర్వీసెస్ డేని భారత ప్రభుత్వం జరుపుకుంటుందన్నారు. 1947లో స్వతంత్ర భారత దేశపు మొదటి హెూంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ ఆఫీసర్ల ప్రోటీషనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న సివిల్ సర్వెంట్లు దేశ పరిపాలన వ్యవస్థకు మూల స్థంబాలుగా వ్యవహరిస్తారు అన్న ఆయన మాటలను ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ఆయన మాటలను స్ఫూర్తిగా తీసుకుని పౌరులకు సేవలు అందించడంలో ఎలాంటి తారతమ్యం చూపకుండా, అవినీతిరహిత సేవలు అందించడానికి అధికారులు నిత్యం కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చైతన్య. వివిద శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- డిఎంహెచ్ఒ గీతాభాయి

ప్రజాశక్తి-ఉయ్యూరు : విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచో గీతాభాయి హెచ్చరించారు. కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి, ఓపీ విభాగం, సేవలు, మందులు తదితరు అంశాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ ఆరోగ్య భద్రత ప్రోగ్రాంపై రివ్యూ చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లాలో రెండవ ర్యాంకు రావడం పట్ల అభినందించారు. ఆరోగ్య కేంద్ర అధికారి శివరామకృష్ణ, ఎంపీహెచ్ఈవో పి.నాగార్జునబాబు, సూపర్ వైజర్ కె శ్రీనివాసరావు ఆరోగ్య కేంద్రం వివరాలు డీఎంహెచ్వోకు తెలియ జేశారు.

రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాభాయి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పెడన : మండలంలోని చెన్నూరు గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ను మంత్రి జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టోర్నమెంటులో పాల్గొన్న క్రీడాకారులకు ఆయన ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజులపాటి వాణి, మండల పరిషత్తు ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుతరావు, మండల వైసీపీ అధ్యక్షుడు కొండవీటి నాగబాబు, ప్రధాన కార్యదర్శి పామర్తి సాంబశివరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోయ ఆంజనేయులు, చెన్నూరు మాజీ సర్పంచ్ గుడి సేవ లక్ష్మీ రాణి, మాజీ జెడ్పిటిసి బుంగ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి- గన్నవరం (ఉంగుటూరు) :ఉంగుటూరు మండలం పెద అవుటపల్లి గ్రామంలో కొలబత్తిన చినప్పకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇటీవల కాలిపోయింది. కట్టుబట్టలతో ఆ కుటుంబం మిగిలింది. ఈ విషయం తెలుసుకున్న ఉపాధి పథకం ఎఫ్ఏ రమణ ఆధ్వర్యంలో ఉపాధి కూలీల నుంచి రూ.14వేలు సేకరించి బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. తమకు సహకరించిన ఉపాధి కూలీలకు బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఐసిడిఎస్ పామర్రు ప్రాజెక్ట్ పరిధిలోని గుడ్లవల్లేరు మండలం అంగలూరు గ్రామం అంగన్వాడి 5 సెంటర్‌లో అంగన్వాడి సహాయకురాలు పోస్ట్ కు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సిడిపిఓ భాను శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో మే ఒకటో తేదీ ఐదు గంటలకు ఐసిడిఎస్ పామర్రు ఆఫీసులో సమర్పించాలని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : శ్రీఆత్మవిద్య పిరమిడ్ ధ్యాన మందిరం అద్వర్యంలో శుక్రవారం గుడ్లవల్లేరు సెంటర్ లో శాకాహార ర్యాలీ, మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సుమారుగా 60 మంది పిరమిడ్ మాస్టర్స్ పాల్గొన్నారు. అందరికి శాకాహార పాంప్లేట్స్ ఇచ్చారు. ఈకార్యక్రమం గుడ్లవల్లేరు పిరమిడ్ సేవాదల్ కన్వీనర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి-కోడూరు : నేత్రదానంతో రెండు జీవితాలకు వెలుగులు లభించాయి. శుక్రవారం కోడూరు శివారు నరసింహపురం గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు మల్లిపెద్ది కోటేశ్వరరావు మాతృమూర్తి మల్లిపెద్ది హైమావతి(94) మృతిచెందారు. తన తల్లి హైమావతి నేత్రాలు మరో ఇద్దరికి చూపునివ్వాలని సదుద్దేశంతో సుధర్మ మానవతా సంస్థ నాగాయలంక వారి సహకారంతో నేత్రదానం చేశారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్ నేత్రాలను సేకరించారు. నాగాయలంక సుదర్శ మానవతా సేవ సంస్థ ద్వారా ఇది174వ నేత్రదానమని సంస్థ సభ్యులు తలసిల రఘు శేఖర్, కనిగంటి నారాయణ తెలిపారు. ఈ నేత్రదానానికి హైమావతి మనవడు మల్లి పెద్ది విశాల్ బాబు తదితరులు సహకరించారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన రంజాన్ తోఫాతో ముస్లిం సోదరులు రంజాన్ పండుగను సంతోషంతో జరుపుకున్నారని టీడీపి నాయకులు వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరులో రిటైర్డ్ ప్రిన్సిపల్ ఇక్బాల్ ఇంటి వద్ద రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు., గుడ్లవల్లేరు తెలుగుదేశం పార్టీ మండల అద్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి ఆద్వర్యంలో ఫైజు, వల్లభనేని వెంకట్రావు, పొట్లూరి రవి, పోలవరపు వెంకట్రావు, ఈడ్పుగంటి ఉమ పాల్గొన్నారు. దగ్గుమిల్లిలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఆదిశేషు, శివకుమార్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు. విన్నకోట రాంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఆదినారాయణ, కిషోర్, ముఖ్య మైనారిటీ నాయకులు 5 పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రైతులు పండించిన ధాన్యాన్ని కొనకుండా ప్రభుత్వం వారిని దగా చేస్తోందని మాజీ మంత్రి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. శుక్రవారం మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామంలో రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనక నష్టపోతున్న రైతులతో సమావేశమై ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సభ్యులు కాగిత వెంకటేశ్వరరావు,, కుంచె నాని , కాగిత గోపాల్ రావు పాల్గొన్నారు.

మంచినీటిని అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి-వన్‌టౌన్ : విజయవాడ 50 డివిజన్ పరశురామయ్య వీధి గుణబత్తుల బంక కామరాజు వీధి అప్పలస్వామి ప్రాంతాల్లో గత రెండురోజులుగా నీటి సరఫరా సక్రమంగా జరగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మురుగు నీరు కూడా వస్తుందని ప్రజలు ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ బి. సత్యబాబు మున్సిపల్ అధికారులకు తెలియ జేశారు. దీంతో స్పందించిన అధికారులు వాటర్ ట్యాంకు ద్వారా మంచినీటి సరఫరా చేశారు. వేసవి పెరుగుతున్న దష్ట్యా తగినంత మంచినీరు రెండు పూటల కలుషితం లేకుండా అందించే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ బి సత్యబాబు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పాడైపోయిన మంచినీటి పైపులైను స్థానంలో కొత్త పైపులైన్లు వేసి బోరింగ్ లను రిపేర్ చేసి ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అందుకు తగిన సిబ్బంది నియమకాలు వెంటనే చేపట్టి పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

వామ్మో రసాలు..

- దజను రూ.250 నుంచి 350 వరకు ధర

ప్రజాశక్తి-మైలవరం : మామిడిని చూస్తే నోరు ఊరనివారు ఉండరు కానీ వాటి ధరలను చూస్తే ఆకాశం అంటుతున్నాయి. దీతో మామిడికాయలు తినాలని కోరిక కూడా చంపుకునే పరిస్థితి నెలకొంది అని మామిడి ప్రియులు వాపోతున్నారు. ప్రస్తుతం మామిడి సీజన్ ప్రారంభమైంది. స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మామిడికాయలను వ్యాపారస్తులు గత పది రోజుల నుండి విక్రయిస్తున్నారు. డజను రసాలు 250 నుంచి 350 వరకు, బంగినపల్లి 350 నుంచి 450 వరకు ధర పలుకుతుంది. దీనితో కొనేందుకు వినియోగదారులు ఈ ధరలు చూసి వామ్మో మామిడికాయలు అంటున్నారు. ప్రస్తుతం ఆవకాయ పచ్చళ్ళు పట్టే సమయం కావడంతో మామిడికాయ ప్రియులు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

రైతుల సంక్షేమానికి సహకార సంఘాలు ఎనలేని కృషి : ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వారికి పెద్దపీట వేస్తు అనేకమైన పథకాలను అమలు చేస్తున్నారని, వాటిలో ముఖ్యంగా సహకార సంఘాల ద్వారా రైతులకు చేయూతనిస్తూ వారి బలోపేతానికి సొసైటీలు కృషి చేస్తున్నాయని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. శుక్రవారం అయ్యప్ప నగర్ లో ది.కష్ణ ఫార్మర్స్ సొసైటీ నూతన అధ్యక్ష ప్రమాణస్వీకార మహెూత్సవంలో ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ది.కష్ణ ఫార్మర్స్ సొసైటీ నూతన అధ్యక్షులుగా నియమితులైన చలమల శ్రీనివాస్, డైరెక్టర్లుగా కారుపాటి జీవరత్నం, పల్లెబోయిన సూరమ్మ లకు నియామకపత్రం అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సొసైటీలు ప్రభుత్వం రైతులకు అందించే అనేక సంక్షేమ పథకాలను, రుణాలను సకాలంలో అందజేస్తు వారి ఆర్థిక పురోభివద్ధికి కషి చేయాలని కోరారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మండల పార్టీ అధ్యక్షులు మండవ శ్రీనివాస్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు జొన్నబట్ల సతీష్ శర్మ పాల్గొన్నారు.



మోదీ గద్దె దిగితేనే దేశానికి రక్షణ

- సిపిఎం, సిపిఐ ప్రచారభేరి పాదయాత్రలో డివి కృష్ణ, కోటేశ్వరరావు

విజయవాడలో మాట్లాడుతున్న డివి కృష్ణ, తదితరులు

విజయవాడ 22వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-విజయవాడ : కేంద్రంలోని మోడీ-బిజెపి ప్రభుత్వం గద్దెదిగితేనే దేశానికి రక్షణ అని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అన్నారు. మోడీ గద్దెదిగాలని ప్రచార భేరి పాదయాత్ర కార్యక్రమం మధురానగర్‌లో ప్రారంభమైన ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ వద్ద ముగిసింది. సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ కార్యక్రమం ఆద్యాంతం అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగింది. మోడీని గద్దె దించాలని, వామపక్షాల ఐక్యత వర్థిల్లాలని నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమానుద్దేశించి డివి కృష్ణ, కోటేశ్వరరావు మాట్లాడుతూ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2009,2014 ఎన్నికల ముందు రాష్ట్రానికి అనేక వాగ్దానాలు చేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇస్తానని తిరుమల వెంకన్న సాక్షిగా చెప్పి ఇవ్వకుండా ఎగ్గొట్టిందన్నారు. రాష్ట్రానికి నిధులు ఇస్తామని చెప్పింది కానీ ఎక్కడ ఇచ్చిన పరిస్థితి లేదని అన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఊసు లేదని విమర్శించారు. ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడానికి మూడు లక్షల కోట్ల రూపాయల విలువైన ఫ్యాక్టరీని 30000 కోట్ల రూపాయలకి ఆదానికి కట్టబెట్టడానికి పూను కుంటుం దన్నారు. అక్కడి కార్మికులను ఇళ్లకు పంపించే ప్రయత్నం చేస్తుందన్నారు. గంగవరం పోర్టును గన్నవరం ఎయిర్ పోర్టును మచిలీపట్నం పోర్టును రైల్వే స్టేషన్ ప్రైవేటీకరణ చేస్తూ ఆధాని ,అంబానీకంపెనీలకు కారు చౌకగా కట్టపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో దేశంలో ప్రజల మీద దాడి చేస్తూ నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతున్నాడన్నారు. ప్రజలపై రాష్ట్రంలో చెత్త పన్ను వేస్తూ ఇంటి పన్ను కరెంటు చార్జీలు పెంచుతున్నాడన్నారు. మోడీ ఏం చెప్తున్నాడో రాష్ట్రంలో జగన్ అదే చేస్తున్నారనీ, మోడీకి జగన్ దాసోహమయ్యాడన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు మోడీ ఏం చెప్తే అదే ఫాలో అయ్యే పరిస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పోరాడుతూ వామపక్ష సిపిఎం, సిపిఐ పార్టీలుగా ప్రచార బేరి పాదయాత్ర విజయవాడ నగరంలో చేస్తున్నామన్నారు. వామపక్ష పార్టీలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీదేవి,సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణ రావు నాయకులు, కే దుర్గారావు, టి ప్రవీణ్ కష్ణమూర్తి కష్ణ చిన్న శశి సిపిఐ నాయకులు నక్కా వీరభద్రరావు, లంక దుర్గారావు, దుర్గాంబ, భాస్కర్‌రావు , సాంబశివరావు, పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణలంక 22వ డివిజన్‌లో ఇంటింటికీ కరపత్రాల ద్వారా ప్రచారం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గద్దెదిగాలని కోరుతూ కృష్ణలంక 20, 21, 22 డివిజన్ల పరిధిలో ఆదివారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రచార భేరి పాదయాత్ర కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పుప్పాల కృష్ణ, సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలే సాంబయ్య కోరారు. పాదయాత్ర విజయాన్ని కోరుతూ 22వ డివిజన్‌లో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. అలాగే పాదయాత్రను విజయవంతం చేయాలని సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నమ్మతల్లిగుడి సెంటర్‌లో కూడా ప్రచారం విస్తృతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల చిన్నారావు, ఇతర నాయకులు, సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగామలో...

గంపలగూడెంలో...

సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ 11వ వార్డులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ నిత్యవసరం వస్తువ ధరలు బాగా కరెంటు చార్జీలు విపరీతంగా పెరిగిపోయిన పరిస్థితి ఈరోజు కనపడతా ఉందన్నారు. ప్రజల మీద భారాలు మోపుతా ఉంది ఈ విషయాలు తెలియజేస్తూ ఇంటింటి తీరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నందిగామ కార్యదర్శి కే గోపాల్ సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, జి గోపి నాయక్, ఎం శ్రీనివాసరావు, కర్రి వెంకటశ్వరరావు ,జంగా దమోదర్ ,సిపిఐ నాయకులు మన్నెం అంజి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- గంపలగూడెం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కొనసాగుతున్న ప్రచార బేరి మండలంలో ఊట్కూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు మాట్లాడుతూ మోడీని గద్దె దింపి దేశాన్ని రక్షిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ జె చారి, గుంటుపల్లి వీరభద్రం ,బండి వీరబాబు, కుర్ర కష్ణ, షేక్ నాగుల్ మీరా ,తెనాలి నాగేశ్వరరావు, తదితరులున్నారు.

భవానీపురంలో లండన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-భవానీపురం : భవానీపురం పున్నమి ఘాట్ సమీపంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో జీవన్ సాగర్ ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. తదనంతరం ఎగ్జిబిషన్లో ఏర్పాటుచేసిన లండన్ సెట్టింగ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు లండన్ అందాలను చూడాలంటే నేరుగా అక్కడికి ప్రయాణించవలసి వచ్చేదని, కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండా లండన్ ఎగ్జిబిషన్ లో లండన్ అందాలను వీక్షించవచ్చుని పేర్కొన్నారు. నిర్వాహకులు పోతుల కష్ణ మాట్లాడుతూ లండన్ సెట్టింగ్ విజయవాడ వాసులను ఎంతగానో అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్లోని సెట్టింగులు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఎంతగానో ఆకట్టుకోవడంతోపాటు ఆశ్చర్య చకితులను చేస్తాయని ఆయన పేర్కొన్నారు. లండన్ ఎగ్జిబిషన్లో జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆట వస్తువులు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకఆకర్షణగా నిలుస్తాయన్నారు. మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయ రెడ్డి, ఇర్ఫాన్, గుడివాడ నరేంద్ర, వైసీపీ నాయకులు కమ్మిలి రత్నకుమార్, నిర్వాహకులు జి. అచ్చయ్య, ఆర్. నారాయణరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

చేతిరాత పోటీలో ప్రతిభ

ప్రజాశక్తి -తిరువూరు : జాతీయ స్థాయి చేతి రాత పోటీలలో తిరువూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ని కొత్తపల్లి వర్షిత రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించింది. జనవరి 23వ తేదీన స్టేట్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ పోటీలలో పాల్గొన్న వర్షిత రాష్ట్ర స్థా యి ఫస్ట్ ర్యాంక్ అవార్డును కైవసం చేసుకుందని ఆమె తండ్రి ఆనంద్ తెలి పారు. విజయవాడ నలంద విద్యానికే తన్ లో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా వర్షిత అవా ర్డు, ప్రసంసా పత్రాన్ని అందుకుంది.

కొత్తూరులో అక్రమ మైనింగ్ ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్‌లో జరిగిన అక్రమ మైనింగ్ ప్రదేశాలను ఎన్టీఆర్ విజయవాడ జిల్లా యంత్రాంగంతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం పరిశీలించింది. కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, పి నైనవరం గ్రామాల పరిధిలో జరిగిన అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై మాజీ సైనికుడు పిల్లి సురేంద్రబాబు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో ఓఎ నెం.53/2023 పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన ఎన్‌జిటి, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, చెన్నై రీజియన్ ఆఫీస్ పర్యవేక్షణలో అక్రమ మైనింగ్ ప్రాంతాలను తనిఖీ చేయడానికి కమిటీని ఏర్పాటు చేసింది. ఎన్‌జిటి ఆదేశాల మేరకు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ త్రిమూర్తులు రెడ్డి, ఎన్టీఆర్ విజయవాడ సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో పాటు కాలుష్య నియంత్రణ మండలి అధికారి, పిటిషనర్, ఆయన న్యాయవాదితో కూడిన ఈ కమిటీ కొత్తూరు తాడేపల్లిలోని అక్రమ మైనింగ్ స్థలాలను పరిశీలించింది. పోలవరం కాలువ వద్ద నుంచి తనిఖీలు ప్రారంభించి అక్రమ మైనింగ్ జరుగుతున్న అన్ని ప్రాంతాలను సందర్శించారు. కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ వద్ద అక్రమ మైనింగ్ స్థలాలను సందర్శించి వీడియోలు తీశారు. కమిటీ సభ్యులు స్థానిక రైతులతో మాట్లాడి అక్రమ మైనింగ్‌పై వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు ఈ కమిటీ తన నివేదికను ఇవ్వనున్నది. విజయవాడ తహశీల్దార్ జాహ్నవి, ఫారెస్ట్ అధికారులు తదితరులు కమిటీ వెంట ఉన్నారు.

విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేయొద్దు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం చేయాలనే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్షాల నాయకులు కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలను విరమించుకోవాలని కోరుతూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జిల్లాలోని పలుచోట్ల ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. గుడివాడ : విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించే చర్యలను విడనాడాలని వామపక్ష నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గుడిపూడి బాబురావు కోరారు. శుక్రవారం స్థానిక అంజనేయపేటలోని సిపిఎం కార్యాలయం వద్ద విభజన హామీలు అమలు, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను విరమించుకోవాలని కోరుతూ రూపొందించిన ప్రచార పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వం దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువలకు తిలోదకాలను ఇస్తోందన్నారు. దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు టి.లక్ష్మణరావు, అర్.కొండ, బి.అరుణ, పి.రజని, హఫీజా, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం :** మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి, దేశాన్ని కాపాడాలి అనే నినాదంతో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు గన్నవరం మూడు బొమ్మల సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని వామ పక్షాల నాయకులు తెలిపారు. ఈ బహిరంగ సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిపిఐ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, సిపిఎం కార్యదర్శి ఎం.ఆంజనేయులు, ఇరుపార్టీల నాయకులు కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, కె.వెంకటేశ్వరవు, చౌటపల్లి రవి, మిరప నాగేశ్వరరావు పాల్గొన్నారు. **కలెక్టరేట్ (కృష్ణా) :** స్థానిక మోదుమూడి శ్రీహరి భవన్‌లో లింగం ఫిలిప్ అధ్యక్షతన ఎఐటియుసి కార్యకర్తల సమావేశం జరిగింది. ఏఐటియుసి కృష్ణాజిల్లా కౌన్సిల్ కన్వీనర్ టి.తాతయ్య మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్మేస్తానని పదేపదే చెబుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీని గద్దె దించాలని మే డే సందర్భంగా కార్మికులు ప్రతిన బూనాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏ ఐ టి యు సి నాయకులు మోదుమూడి నాగరాజు, వీరాభత్తుల బుజ్జి లు పాల్గొన్నారు. **మొవ్వ :** బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు నిర్వహిస్తున్న ప్రచార భేరీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం మొవ్వ మండలంలోని కూచిపూడిలో సమావేశమైన నేతలు గోడపత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 22న మొవ్వ, 24న కూచిపూడి, 25న కోసూరు,కాజ, 27న నిడుమోలులో కరపత్రాలు పంపిణీ జరుగుతుందన్నారు. కూచిపూడి, కోసూరు, నిడుమోలులలో ప్రచార సభ నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శీలం నారాయణరావు, వెంకటేశ్వరరావు, పెదముత్తేవి సంసోను,కాకి రాజశేఖర్, పిఐ నేత దగాని సంగీతరావు, మొవ్వ మండల కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, కూచిపూడి శాఖ కార్యదర్శి కొండా నాగేశ్వరరావు, సభ్యుడు కలపాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో

గన్నవరంలో

మొవ్వలో

మచిలీపట్నంలో

గుడ్లవల్లేరులో

కలెక్టర్‌ను కలిసిన పేర్ని, కైలే

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మాజీ మంత్రి, బందరు శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), పామర్రు కైలే అనీల్ కుమార్‌లు శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.రాజా బాబుని కలెక్టర్ చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు కలెక్టర్ బందరు, పామర్రు నియోజకవర్గాల్లోని అభివృద్ధి పనులు, సమస్యలపై వారు చర్చించారు.

కలెక్టర్ రాజబాబుకు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యేలు కైలే అనిల్, పేర్ని నాని

రోగికి ఎమ్మెల్యే వంశీ ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-గన్నవరం

ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన ముల్లంగి గణేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయాన్ని అతడు వాట్సాప్ ద్వారా గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్‌కు మెసేజ్ పెట్టారు. దీనికి ఆయన స్పందించి తక్షణ సహాయంగా రూ.20 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సలివేంద్ర రామకృష్ణ, మండల నాయకులు గొన్నూరు సీమయ్య, వింతా శంకర్ రెడ్డి, వింత ఆదినారాయరెడ్డి తదితరులు పాల్గన్నారు.

అధికారంలోకి వచ్చేందుకు కృషిచేయాలి : చలసాని

ప్రజాశక్తి-పెదపారుపూడి

రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించటం ద్వారా అధికారంలోకి రావటానికి కృషిచేయాలని టిడిపి పెదపారుపూడి

మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి (చంటి) కోరారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు 74వ పుట్టినరోజు వేడుకల్లో ఆయన మాట్లాడారు. వైసిపి పాలన పూర్తి అవినీతిమయంగా మారిందన్నారు. టిడిపి అధికారంలోకి రావటానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మసి ముక్కు రాంబాబు, మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, కలపాల కిషోర్, పాలడుగుల సంధ్యారాణి, సుభద్ర, నత్తా వాణి, చెరుకూరి విజయ్ కుమార్, చాపరాల శివప్రసాద్, పాలడుగు గణేష్, పునుకొల్లు సందీప్, బుడ్డాలు, చదలవాడ రాధాకృష్ణ దూళజమీ బాబు, డి.వెంకటనారాయణ, గోగం రామారావు, చాపరాల పునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెడన

ఈనెల 24వ తారీఖున జగనన్న చలో విజయవాడ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లాం తాంతియకుమారి పెడనలో చలో విజయవాడ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో జై భారత్ సత్య గ్రహ సభను ఏర్పాటుచేశారన్నారు. విజయవాడలోని జింఖానా

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

గ్రౌండ్స్‌లో ఈనెల 24న సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి లింగాల సుధాకరరావు అధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెదపూడి దీలిప్ కుమార్, మచిలీపట్నం ఇన్‌ఛార్జి మహమ్మద్ దాదా సాహెబ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఆకురాతి జనార్ధన్, పెడన పట్టణ అధ్యక్షుడు చౌడవరపు అప్పారావు, యక్కల నాగేశ్వరావు, జనవ్వుల లీల కృష్ణ, రాష్ట్ర మైనారిటీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఫిరోజ్, మచిలీపట్నం నగర అధ్యక్షుడు కొడమంచిలి చంద్రశేఖర్. విజయవాడ సిటీ వైస్ ప్రెసిడెంట్ ఉండేటి జోసఫ్, మండల నాయకులు ఎం.ప్రసాద్ రాజు, తెనాలి రాజేంద్ర పాల్గొన్నారు

ఆర్థిక సహాయం

పెడన : మండలంలోని ఈదుమూడి గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురైన రెండు కుటుంబాల వారికి టిడిపి తరపున రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కాగిత కృష్ణ ప్రసాద్ గ్రామానికి వెళ్లి బాధ్యత కుటుంబానికి ఈ సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అర్జ వెంకట నగేష్, మండల టిడిపి అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్, ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పోలగాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు

మెడికల్ కళాశాల పనులు వేగంగా పూర్తి చేయాలి : రాజబాబు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మచిలీపట్నంలో 75 ఎకరాల్లో రూ.550 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మచిలీపట్నం నుంచి కరగ్రహారానికి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవనాన్ని, తరగతి గదులను, వసతి గృహాలను పరిశీలించిన కలెక్టర్ , వీలైనంత త్వరగా చివరిదశ పెండింగ్ పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య కళాశాల పనుల పురోగతిపై కలెక్టర్ సంతప్తి వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజ్ ఆస్పత్రిని అభివృద్ధి చేసేందుకు సివిల్, ఎలక్ట్రికల్, వాటర్ సప్లయ్ సంబంధిత పనులను వేగవంతం చేయాలని తెలిపారు. సెంట్రల్ రిసెప్షన్ రూమ్, ఔట్ పేషెంట్ రూమ్, మెడిసిన్, సర్జరీ, ఆర్థోపెడిక్స్ కోసం ప్రత్యేక గదులు, పిల్లల వార్డు, గుండె సంబంధిత సమస్యల చికిత్స ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. అన్ని పనులను పూర్తి చేసిన తర్వాత ఇండియన్ మెడికల్ కౌన్సెలింగ్ బందం ఆసుపత్రిలో అభివద్ధి చేసిన సౌకర్యాలను పరిశీలించి, మెడికల్ కాలేజీ హాస్పిటల్ ప్రారంభానికి అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. స్థానిక శాసనసభ్యులు పేర్ని నాని మాట్లాడుతూ, ప్రభుత్వం మచిలీపట్నంలో వైద్య కళాశాలల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చిందన్నారు. మచిలీపట్నంలో నిర్మితమవుతున్న వైద్య కళాశాల ఏడు నియోజకవర్గాలకు తలమానికంగా మారనున్నట్లు తెలిపారుముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో మే 31వ తేదీ 2021 వర్చువల్ విధానంలో వైద్య కళాశాల పనులకు శంకుస్థాపన చేశారని, కేవలం రెండు సంవత్సరాల కాలవ్యవధిలో మెడికల్ కళాశాల ఆధునిక ఇంజనీరింగ్ విధానాలతో సర్వాంగ సుందరంగా శరవేగంగా రూపొందిందని ఆయన సంతప్తి వ్యక్తం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట బందరు ఆర్డిఓ ఐ. కిషోర్, తహసిల్దార్ డి. సునీల్ బాబు, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రా లిమిటెడ్ సైట్ ఇంజనీర్ జగదీష్, లంకె వెంకటేశ్వరరావు,శొంటి ఫరీద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన నేర్సు లక్ష్మమ్మ ఇటీవల మృతిచెందారు. ఆమె వైఎస్సార్ బీమాలో సభ్యురాలుగా ఉన్నారు. రూ.లక్ష ఆర్థిక సహాయంగా అందనుంది.

తొలుత తక్షణ సహాయంగా నెర్సు లక్ష్మమ్మ కుమార్తె నేర్సు ఆదిలక్ష్మికి రూ.10 వేలు అందజేశారు. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఆ వార్డు సభ్యులు మూల్పూరు మాధవన్ చేతుల మీదగా ఈ నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం అధికారి జయ దుర్గా ప్రసాద్ , వాలంటీర్ కొడాలి వర ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు 72 లక్షల పని దినాలే లక్ష్యం

డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత

ప్రజాశక్తి-విజయవాడ రూరల్

ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 72 లక్షల పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జె సునీత జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామి పథకం పనులు వేగవంతంపై డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె. సునీత శుక్రవారం గొల్లపూడి లోని ఆమె కార్యాలయంలో జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి హామి పథకం కింద 72 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. కూలీలకు రోజువారీ వేతనం రూ.272 కల్పించేందుకు కృషి చేయాలని డ్వామా పిడి సునీత అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలన్నారు. గత ఏడాది 77 లక్షల పనిదినాలను లక్ష్యంగా నిర్దేశించగా 73 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. ఈ ఏడాది నూరు శాతం పనిదినాలు కల్పించి జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు సమిష్టిగా పనిచేయాలన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు 6 లక్షల పైగా పనిదినాలను కల్పించామని వేసవి కాలాన్ని దష్టిలో పెట్టుకొని పని కోరిన ప్రతి కూలికి ఉపాధి కల్పించాలన్నారు. ప్రస్తుతం మిరప , ప్రత్తి, జొన్న పంటలకు సంబంధించిన పనులకు కూలీలు హాజరవుతున్నారని మరో వారం రోజులలో పంట పనులు పూర్తికానున్నాయని దీనిని దష్టిలో పెట్టుకొని కూలీలకు పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లు, పంటకాలువలు, పంటబోదులు, డొంకరోడ్లు అభివద్ధి చేయడం, కందకాలు తవ్వడం వంటి పనులను చేపట్టాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు వారు చేసిన పనుల ఆధారంగా రోజుకు సగటున 272 రూపాయలు వేతనం అందించేలా పనులు చేపట్టాలన్నారు. కూలీలు అవసరమైతే ఒక గంట అదనంగా పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూలీల మస్తరు పని వివరాలు ఏ రోజుకారోజు నమోదు చేసి సకాలంలో వేతనాలను చెల్లించేందుకు కషి చేయాలన్నారు. వేసవి దష్ట్యా కూలీలకు త్రాగు నీరు సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ప్రాథమిక చికిత్స కిట్లను సిద్ధంగా ఉంచాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ జె. సునీత కోరారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మణి కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: భవానిపురం పోలీస్ స్టేషన్ పరిదిలోని గొల్లపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విద్యా అకాడమి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నివారణకు తీసుకునే జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. పోక్సో యాక్ట్ గురించి, డైయల్ 100, 112 మరియు దిశ యాప్ వలన కలిగే ఉపయోగాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, ఎల్.హెచ్.ఎమ్.యస్, మాదక ద్రవ్యాలకు దూరంగా , మహిళా సంబంధిత నేరాల గురించి దిశా సబ్ ఇన్స్పెక్టర్ విజయకుమారి వివరించారు. అదే విధంగా మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలని , గంగిరెద్దుల దిబ్బ ఏరియాల లోని వివిధ ప్రదేశాలలోని ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బంది చేరువ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. చిన్నపిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏమిటీ తదితర అంశాలపై పోలీసు అధికారులు వివరించారు. నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు , చిన్న చిన్న వీడియోల రూపంలో ఎల్ఇడి స్ర్కీన్ పై ప్రదర్శించి అవగాహన కల్పించారు.

ఇద్దరు నగర బహిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ: గంజాయి ఇతర మత్తుపదార్థాలను సేవించి అల్లర్లకు పాల్పడి, సమాజంలో అలజడి సష్టిస్తున్న అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ కు చెందిన షేక్ కరిముల్లా, అరిపిల్లి వెంకటేష్‌లను ప్రజా శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్నందున నగరం నుండి బహిష్కరిస్తున్నట్లుగా విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో శాంతి భద్రతలకు, సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలకు, గంజాయి , ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణా చేయడం వంటి వాటితో అలజడి సృష్టిస్తున్న షేక్ కరిముల్లా , అరిపిల్లి వెంకటేష్ ఏబొజ్జా లు వివిధ నేరాలకు సంబంధించి అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్ళి బయటకు వచ్చిన అనంతరం కూడా తమ నేర ప్రవత్తిని మార్చుకోకపోవడం వలన , శాంతి భద్రతలకు విఘాతం కలుగ జేస్తున్నందున వీరిని ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధి నుండి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా నగరంలో శాంతి భద్రతలకు, సామాన్య ప్రజా జీవనానికి విఘాతం కలిగిస్తూ, అవాంఛనీయ సంఘటనలకు, అల్లర్లకు పాల్పడి, సమాజంలో అలజడి సష్టిస్తున్న 18 మందిని ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధి నుండి బహిష్కరించడం జరిగిందన్నారు. అదేవిధంగా మరి కొంత మంది చెడు నడత కలిగిన వ్యక్తులను గుర్తించి వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ మొదలైందన్నారు. నగరంలో ఉన్న చెడునడత కలిగిన వ్యక్తులపై ఇప్పటికే పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి సమాచారం సేకరించడం జరిగింది. వీరు ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే వారిపై కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అలాగే విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో చెడు నడత కలిగిన వ్యక్తులు ప్రజా జీవనానికి భంగం కలిగించటంగాని, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న పక్షంలో వారిని ఉపేక్షించకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారన్నారు. నేర ప్రవత్తిని మార్చుకోకుండా నేరాలకు పాల్పడే వారిపై నిఘా ఏర్పాటు చేసి అటువంటి వారి సమాచారం సేకరించి నగర బహిష్కరణ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బిబిఎ

ప్రజాశక్తి-విజయవాడ: ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రాను బెజవాడ బార్ అసోసియేషన్ (బిబిఎ) గవర్నింగ్ బాడీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. బిబిఎ అధ్యక్షుడు కె.బి.సుందర్, ఉపాధ్యక్షుడు పుప్పాలా శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్, జాయింట్ సెక్రటరీ నరహరిశెట్టి జ్యోతి, లైబ్రేరియన్ ఆకుల పాండురంగ విటల్, కోశాధికారి బత్తుల వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పగడాల ఆంజనేయులు, లేడీస్ సెక్రటరీ పెనుమాల జయలక్ష్మి న్యాయమూర్తిని దుస్సాలువాతో సత్కరించారు.

బెజవాడలో నూతనంగా నిర్మించిన న్యాయస్థాన భవన సముదాయాలలో అపరిష్కతంగా ఉన్న సమస్యలను న్యాయమూర్తి దష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు బిబిఎ గవర్నింగ్ బాడీ తెలిపింది.

కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-విజయవాడ: ముస్లింలు పరమనిష్టతో చేసే ఉపవాసం ఎంతో గొప్పదని, ఆధ్యాత్మిక భావన ఉట్టిపడే రంజాన్ పండుగ సందర్భంగా పాటించే నియమాలు ప్రతిఒక్కరికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. రంజాన్ పండుగను ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలన్నారు. ముస్లిం కుటుంబ సభ్యులకు, అధికారులకు, ఉద్యోగులకు ఈ సందర్భంగా కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి చేతిరాత పోటీల్లో నగర విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: జనవరి 23వ తారీకు జాతీయస్థాయి చేతిరాత దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన చేతిరాత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు విజయవాడ నలంద విద్యానికేతన్ లో బహుమతులు అందజేయడం జరిగింది. ఈ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కుమారుడు జివితేష్ జాతీయస్థాయి చేతిరాత పోటీల్లో ఛాంపియన్షిప్ సాధించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రద్యుమ్న కుమార్తె అవ్యక్త ప్రద్యుమ్న పూజారి మిస్ ఇండియా ఛాంపియన్షిప్, ఆలపాటి ప్రహర్షిక ఎక్సెన్సీ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ అవార్డును సాధించారు. మేనేజింగ్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ జి. వీరపాండ్యన్, హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ షా, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ సీఈఓ హరేంధీర ప్రసాద్, అమ్మబడి హ్యాండ్ రైటింగ్ అండ్ కాలిగ్రఫీ ఇన్స్టిట్యూట్ చైర్మన్ లోలుగు శేఖర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పేరెంట్ ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా మరియు రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న పాల్గొన్నారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుండి గెలుపొందిన 80 మంది విద్యార్థులకు అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నలంద విద్యానికేతన్ వైస్ ప్రిన్సిపాల్ పి భవాని, పి.భువనచంద్ర, తెలుగు రాష్ట్రాలు నుండి గెలుపొందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు, విజయవాడ.

ఐ.పి. నెం. 52/2020

జే.నరేంద్ర ... వాది

మరియు

వై. కృష్ణప్రదీప్ మరియొకరు ... ప్రతివాదులు

పైన తెలిపిన పిటీషన్‌లో 1వ ప్రతివాది అయిన యరసాని కృష్ణప్రదీప్ తండ్రి అప్పారావు, డోర్ నెం. 21-10/3-31, 1వ లైను, శ్రీనగర్ కాలనీ, విజయవాడ-11 వారి యొక్క హాజరు నిమిత్తం కోర్టువారు కేసును ది. 10-05-2023వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున సదరు యరసాని కృష్ణప్రదీప్ గారు సదరు తేదీన సదరు కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై పై కోర్టులో వారి యొక్క వాదనలు తెలుపుకోగలరు. అలా రాని యెడల, వాదికి తెలుపుకొనేది ఏమీ లేదని భావించి కోర్టువారు తదుపరి చర్యలకు పూనుకొందరు.

(కోర్టువారి ఆర్డరుపై ఇవ్వబడిన నోటీసు)

వాయిదాతేది : 10-05-2023

ఇట్లు
ఆలూరి సుధాకరరావు,
అడ్వొకేట్,
మారుతీనగర్, విజయవాడ-4.
ఫోన్ : **9392133535**

పాస్‌పోర్టు పోయినది

షేక్ ఆదమ్ షరీఫ్ తండ్రి షేక్ సలీమ్,అను నాకు హైదరాబాద్ పాస్ పోర్టు కార్యాలయం అధికారులు ది.20/02/2014 న **L7405152** నెంబర్ గల పాస్ పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు విజయవాడ నగరం సూర్యారావుపేట రోడ్డులో బండిపై వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది. వాటి నిమిత్తం ఎంత వెతికినా ఆచూకీ దొరకలేదు. కావున నా పాస్ పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుచున్నాను.

షేక్ ఆదమ్ షరీఫ్ తండ్రి. షేక్ సలీమ్,
D. No.2-68/A, **రేవేంద్రపాడు గ్రామం,**
దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.
సెల్ నంబర్: **9014035858**

IN THE COURT OF THE MVACT CUM X TH ADDL CHIEF JUDGE CITY CIVIL COURT : AT HYDERABAD

M.V.O.P.No. 2362 of 2018

Between:
K. Srinivasa Rao
.... Petitioner

AND

G Hanumantha Rao and other
... Respondents

To,
1.G. Hanumantha Rao, S/o. Thirupathi Rao, age : Major, Occ: Business, R/o: 2-60, Govt School back side, Ganapavaram, Mylavaram, Krishna District.
2. K Jaya Raju, S/o. Gangaiah, age: 33 years, Occ: Driver, R/o. Velvadam Village, Mylavaram Mandal, Krishna District.

Please take notice that the petitioner had filed the above case for grant of compensation for the injuries sustained by him in a motor vehicle Accident Which Occured on 03-02-2018 under the limits of P.S. Mylavaram.

The above case is posted to 10-05-2023 at 10.30 AM for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on Specified date and time either in person or through an Advocate, else the case will be decided Exparte.

(BY ORDER OF THE COURT)

K. ANAND REDDY
D. VENKAT RAMANA
Advocates
Counsels for the Petitioner
Office : Flat No. 212, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036
Cell: 9848052455, 9848051707.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 1313/2016, in A.S.No. /2016

Between:
Sri Marasani Rama Mohana Rao
...Petitioners /Appellant
(4th Defendant in Lower Court)
AND
Sri Chennoju Ram Prasad
...Respondents /Respondent
(Plaintiff in Lower Court)
Sri Kotagiri Vijaya Shobhanadra Rao
Sri Kootagiri Chinni Murali Krishna
Smt Kotagiri Sree Lakshmi
...Respondents /Respondents
(1 to 3 Defendants in Lower Court)

2nd Respondent:
Kotagiri Vijaya Shobhanadra Rao, S/o. Chennayudu, 63 Years, Male, Business, Gudivada, Krishna Dist.

3rd Respondent:
Kotagiri Chinni Murali Krishna, S/o. Vijaya Shobhanadra Rao, 43 Years, Male, Business, Gudivada, Krishna Dist.

4th Respondent:
Kotagiri Sree Lakshmi, D/o. Vijaya Shobhanadra Rao, 33 Years, Female, Business, Gudivada, Krishna Dist.

పై నెంబరు అప్పీలులో అప్పిలెంటు / దిగువ కోర్టులో 4వ ప్రతివాది అయిన నేను అప్పీలు దాఖలు చేయుటలో ఆలస్యంను క్షమించమని కోరుచూ దాఖలు చేసిన పిటీషనులో 2 నుంచి 4 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించియున్నప్పటికి మీరు తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలు నిమత్తం వాయిదా వేసియున్నారు. వాయిదా తేదీ **ది. 28-04-2023 సం॥రం తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరయ్యి ఆక్షేపణలు ఉన్నఎడల తెలుపుకొనవలెను.** లేని ఎడల 2 నుంచి 4 రెస్పాండెంట్లు అయిన మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 28-04-2023

ముద్దన శ్రీనివాసరావు, న్యాయవాది,
తాడేపల్లిగూడెం. సెల్: 99483 37320

అంబటి బ్రాహ్మణయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ పార్లమెంట్ సభ్యులు కీర్తిశేషులు అంబటి బ్రాహ్మణయ్య వర్థంతి కార్యక్రమాలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం జరిగాయి. **అవనిగడ్డ :** బందరు మాజీ పార్లమెంట్ సభ్యులు, అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు అంబటి బ్రాహ్మణయ్య వర్థంతిని అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. వైసీపీ పార్టీ కార్యాలయం వద్ద అంబటి చిత్రపటానికి శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పూలదండలు వేసి నివాళులర్పించారు. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల వ్యవసాయ విభాగం సమన్వయ కర్త కడవకొల్లు నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, దక్షిణచిరువోల్లంక సర్పంచ్ కనక సుబ్రహ్మణ్యం, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృధ్వీరాజ్, మాజీ ఉపసర్పంచ్ గాజుల జై గోపాల్, రాష్ట్ర మౌలిక వసతుల శాఖ డైరెక్టర్ మద్ది చిన్న, వైసిపి నాయకులు బచ్చు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయం వద్ద ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కర్ర సుధాకర్, నాయకులు బండే రాఘవ, మాచవరపు ఆదినారాయణ, మండలి రామ్మోహనరావు, లింగం బాబూరావు, బర్మా శ్రీనివాసరావు, మెగావత్ గోపి, పెదపాలెం సర్పంచ్ దున్న రాజేష్, కొండవీటి పాండురంగారావు, యలవర్తి చిన్న, గుడివాడ మల్లికార్జునరావు, పులిగడ్డ నాంచారయ్య, కైతేపల్లి ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు. **గుడివాడ :** స్థానిక టిడిపి కార్యాలయంలో అంబటి బ్రాహ్మణయ్య చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టిడిపి రూరల్ అధ్యక్షుడు వాసే మురళీ, పట్టణ కార్యదర్శి పోలాసి ఉమామహేశ్వరరావు, నాయకులు పంద్రాజు సాంబశివరావు, కంచర్ల సుధాకార్, షేక్ జానీషరీఫ్, గోవాడ శివా, షయ్యద్ జబీన్, వేణు, అల్లాడ శ్రీను, పట్టపు చిన్నా, సాల్మన్, దేవాధి నాగేశ్వరరావు పాల్గొన్నారు. **కలెక్టరేట్ :** స్థానిక నియోజక వర్గ టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అంబటి బ్రాహ్మణ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి బాబా ప్రసాద్, గొపు సత్యనారాయణ, పార్టీ పట్టణ కార్యదర్శి పి. కాంతారావు పాల్గొన్నారు.



గుడివాడలో

గుడివాడలో

అవనిగడ్డలో

ధాన్యం అమ్ముకోవటానికి అవస్థలు పడుతున్నాం

గడప గడపకూ మనప్రభుత్వంలో సారథికి నిరసన సెగ

ఉయ్యూరు : పండించిన ధాన్యం అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది, మిల్లరకు అయినకాడికి అమ్ముకుని తీవ్రంగా నష్టపోయాం. రాష్ట్రానికి రాజధాని ఏదో తెలి యదు, పంచాయతీల్లో పైసాలేక అభివృద్ధి లేదంటూ చినఓగిరాలలో రైతులు, గ్రామస్తులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని నిలదీశారు. చినఓగిరాలలో శుక్రవారం గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే సారథికి స్థానికులు సమస్యల చిట్టా విప్పారు. సంక్షేమ పథకాల ఆశచూపి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని మరచిందన్నారు. రాష్ట్రానికి కంపెనీలు రాక యువకులు నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటూ పక్క రాష్ట్రాలకు తరలి పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని లింగమనేని బాలాజీ ఆందోళన వ్యక్తంచేశారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన 14, 15 ఆర్థిక సంఘ నిధులు రాష్ట్ర ప్రభుత్వ దారిమళ్లించిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. గ్రామంలో డ్రెయినేజి సదుపాయంలేక ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వొద్దంటారా? ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి ఇష్టప్రకారం ప్రభుత్వం నడుస్తుందని సారథి బదులిచ్చారు. ధాన్యం కొనేవారు లేక తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోయామని రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం తోలితే మట్టి, తేమని మిల్లర్లు సాకు చూపడంతో అడిగిన కాడికి అమ్ముకుని నష్టపోయామని పాలడుగు శివశంకర్ ఎమ్మెల్యేకు తన బాధ వివరించారు. తోలిన ధాన్యం ఆన్లైన్ కాలేదు, తోలిన ధాన్యానికి ఇంతవరకు కొందరికి డబ్బు రాలేదని శివశంకర్ ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు నిలిచిపోయిందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రైతు భరో సాకేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందని సారథి వివరణ ఇచ్చారు.

గుడివాడను అభివృద్ధి చేయని కొడాలి నాని : రావి

గుడివాడ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని గుడివాడ అభివృద్ధికి కనీసం గుప్పెడు మట్టి కూడా పోయలేదనీ, మట్టిని మాత్రం అక్రమంగా తరలించి లక్షాలాధి రూపాయిలను సంపాదించారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ యువ నాయకుడు నారా లోకేష్ యువత కోసం యువగళం పాదయాత్ర 77వ రోజు 1000 కిలో మీటర్లు పూర్తి చేసుకోవడం, అయనకు ప్రజల నుండి వస్తున్న స్పందన మద్దతుతో మిగిలిన 3వేల కిలో మీటర్లు పూర్తి చేసుకోవాలన్నారు.

వృద్ధురాలిని మోసం చేసిన ఇద్దరు కేటుగాళ్ళు

గన్నవరం : పోత గన్నవరానికి చెందిన నర్రా విజయలక్ష్మి (60) ఇంటికి బంగారం మెరుగుపెడతామని వచ్చిన ఇద్దరు వ్యక్తులు చివరకు ఆమె కళ్ళు కప్పి బంగారంతో ఉడాయించిన సంఘటన శుక్రవారం జరిగింది. సీఐ కనకారావు కథనం ప్రకారం బైకుపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసు, గాజులు, ఉంగరాలు మెరుగుపెట్టేందుకు వృద్ధురాలు ఇంటికి వెళ్లారు. వారి మాటలను నమ్మిన ఆమె బంగారు వస్తువులను తీసుకొచ్చి వారికి ఇచ్చింది. వేడినీళ్లు తీసుకురామని ఆమెను ఇంట్లోకి పంపి 20 కాసులు బంగారు వస్తువులతో దొంగలు పరారయ్యారు. ఇంట్లో నుంచి బయటకు వచ్చిన వృద్ధురాలు బంగారం కనిపించకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గన్నవరం సిఐ కనకారావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు రంగంలోకి దిగి ఆ ఏరియాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి దొంగల ఫొటోలను గుర్తించారు. గత నెలల్లో తెంపల్లి గ్రామంలో ఇదే సంఘటన జరగ్గా ముందుగా గుర్తించిన గ్రామస్తులు మోసగాడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

లే అవుట్‌ను పరిశీలిస్తున్న అపరాజితసింగ్

గృహ నిర్మాణాలు వేగంగా జరిగేలా చూడాలి

కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితాసింగ్

ప్రజాశక్తి-పమిడిముక్కల

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న వైఎస్సార్ కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చూడాలని కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజితా సింగ్ కోరారు. పమిడిముక్కల మండలం తాడంకి పంచాయతీ పరిధిలోని జగనన్న లేఔట్లను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పునాది స్థాయి(బి.ఎల్) ఆపై స్థాయిల్లో ఉన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం దశల వారీ పూర్తి చేసే విధంగా లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. మండలంలోని అన్ని లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం పురోగతి సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దారులు, గహ నిర్మాణ సంస్థ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గృహాల నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇనుము, ఇసుక తదితర సామాగ్రితో పాటు బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు అన్ని విధాలా తోడ్పడాలని కోరారు. లే అవుట్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కరెంటు సౌకర్యం, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల వద్ద ఉన్న పెండింగ్ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో విజయకుమార్, తహశీల్దార్ బి.రాజ్యలక్ష్మి, పమిడిముక్కల ఎంపిడిఒ సుధా ప్రవీణ్ , విద్యుత్ ఎఇ శ్రీనివాస్, తాడంకి గ్రామ కార్యదర్శి సునీత, వైసిపి నాయకులు వీరంకి చిరంజీవి, యేనుగ వెంకటేశ్వరరావు, కొడాలి రాంబాబు, హౌసింగ్ ఏఈ ప్రసాద్, జంపాన వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎఇ షరాబంది రాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పవిత్ర రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, దాతృత్వానికి, రంజాన్ మాసం ప్రతీక, ఉపవాస దీక్షలు, ప్రార్థనలు సోదరభావం, ప్రేమ పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా అనుసరించిన మార్గంలో నడవాలని కోరారు.

మళ్లీ జగన్ సిఎం కావాలి : వైసిపి

ప్రజాశక్తి-గన్నవరం

మండలంలోని అల్లాపురం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో 'మా నమ్మకం నువ్వే మా భవిష్యత్తు నువ్వే జగనన్న' కార్యక్రమం సర్పంచ్ డొక్కు సాంబశివ వెంకన్న బాబు ఆధ్వర్యంలో శుక్రవారం గృహ సారధులు, కన్వీనర్లు తో నిర్వహించారు. ప్రతి ఇంటికి సీఎం జగన్మోహనరెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి జగనన్న స్టిక్కర్లు అంటించారు. సర్పంచ్ వెంకన్న బాబు మాట్లాడుతూ గన్నవరం ఎమ్మెల్యే వంశీ ఆదేశాల మేరకు గ్రామంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఈ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల్ని ప్రతి ఇంటి ముంగిటికీ తీసుకుపోతూ నేరుగా వారి ఖాతాలోనే జమ అయ్యేవిధంగా చేయడం ఈ రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలను యధావిధిగా కొనసాగాలని, ప్రతి పేదవాడు ముఖంలో చిరునవ్వు చూడాలని వాలంటరీ వ్యవస్థ ద్వారా ఎక్కడ ఏ లోటుపాట్లు ఉన్నా కానీ వెంటనే పరిష్కరించే విధంగా సచివాలయ సిబ్బంది ముందు మేల్కొని వారికి ఆ పథకం అందే విధంగా చర్యలు తీసుకోవడం చాలా శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుటపల్లి శివప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** పెదపారుపూడి సచివాలయ పరిధిలో పెదపారుపూడి 'మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమంలో భాగంగా గృహ సారథులు, వాలంటీర్ల సమక్షంలో పిఎసిఎస్ అధ్యక్షుడు, వైసిపి నాయకుడు తుమ్మల కోటేశ్వరరావు, వాలంటీర్లు గుమ్మడి ప్రీతి, దర్శి రత్నకుమారి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి వివరించారు. ఈ కార్యక్రమంలో నత్తా మరియమ్మ గహం వద్ద గృహసారథులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-అవనిగడ్డ

రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అవనిగడ్డలోని ముస్లిం సోదరులకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఇఫ్తార్ విందు అందజేశారు. శుక్రవారం ఏడో వార్డులోని మజీద్ వద్దకు వెళ్లి ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమామ్ సహ జాబ్ రంజాన్ ప్రత్యేకతను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం షాదికాని వద్ద ఇఫ్తార్ విందు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అబ్దుల్ రహమాన్ గౌస్, అబ్దుల్ అజీజ్, షేక్ బాబావాలి మురాద్, టిడిపి నాయకులు యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బండి రాఘవ, బచ్చు రఘునాథ్, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, ఘంటసాల రాజమోహనరావు, మండలి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు

గడపగడపకూ దగా కార్యక్రమం

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నువ్వే మా నమ్మకం జగనన్న' అనే కార్యక్రమానికి ప్రత్యామ్నాయంగా జై భీమ్ భారత్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గం ఇంచార్జ్ సముద్రాల అంబేద్కర్ ఆధ్వర్యంలో గడపగడపకు దగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం అవనిగడ్డలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక కార్యక్రమాలపై పుస్తకాన్ని ప్రచురించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీలకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేయడం, డాక్టర్ సుధాకర్, డాక్టర్ అనిత, డాక్టర్ అచ్చన్నలను వేధింపులకు గురిచేసి వారు చనిపోయే విధంగా చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోరుముచ్చు రవి, పి.శ్రీనివాసరావు, జి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడను క్లీన్ సిటీగా ఉంచాలి : కమిషనర్

మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: స్వచ్ఛ సర్వేక్షణ్-23లో దేశ స్థాయిలో విజయవాడ ప్రథమ ర్యాంక్ సాధించడానికి ఆధునిక పారిశుధ్య విధానాలు అమలు చేసి, క్లీన్ సిటీగా ఉంచడానికి శానిటరీ ఇనిస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు కృషి చేయాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షణ్- 2023లో విజయవాడ ప్రథమ ర్యాంక్ సాధించడానికి చేయాల్సిన కర్తవ్యాలపై శానిటరీ ఇన్స్పెక్టర్లు,శానిటరీ సెక్రటరీలు,మేస్త్రిలు, లీడ్ వర్కర్లకు స్థానిక తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శుక్రవారం వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నూరు శాతం బాస్కెట్ కలెక్షన్ చేయాలన్నారు. తద్వారా నగరములో జివిపిలు రాకుండా క్లీన్ సిటీగా ఉంచడానికి అవకాశం ఉంటుందన్నారు. అంతేగాక నగరంలోని ప్రతి డివిజన్‌లోని ప్రతి వీధిలోని రోడ్ల మార్జిన్స్‌లో ఉన్న పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలు పూర్తిగా తొలగించాలన్నారు. ఇటువంటి పనిని కనీసంగా నెలకు రెండు సార్లు అన్ని వీధులు కవర్ అయ్యే విధంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని కోరారు. డ్రెయిన్లలో ఫ్లోటింగ్ గార్బేజి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్లలో ఏర్పాటు చేసిన స్క్రీన్స్ వద్ద వచ్చిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ స్క్రీన్స్, గ్రేటింగ్స్ వద్ద పరిశుభ్రంగా ఉంచాలన్నారు.రోడ్ల మార్జిన్ల వద్ద ఖాళీ స్థలాలలో చెత్త లేకుండా సి అండ్ డి వేస్ట్ లేకుండా చూచాలన్నారు. పారిశుద్య కార్మికులకు వ్యక్తిగత భద్రత పరికరాలను విఎంసి అధికారులు ఏర్పాటు చేయాలన్నారు.కార్మికులకు చెప్పులు ,రేడియం జాకెట్స్, గ్లౌజ్‌లు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. డోర్ టు డోర్ కలెక్షన్‌కు ఉపయోగిస్తున్న ఆటోలను వారానికి రెండు సార్లు వాటర్ సర్వీసింగ్ చేయించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నగరంలో ఉన్న టిసి, పిటి, యూరినల్స్ యురినల్స్ నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమామలో అసిస్టెంట్ కమిషనర్ (ప్రాజెక్టు) కె సత్యవతి, సిఎంఒహెచ్ డాక్టర్ పి.రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా పాలిసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను శుక్రవాకం అందజేశారు. వికాస్ ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో తరగతులకు హాజరైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను కళాశాల ప్రిన్సిపల్ గోపాలకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు చదువు ఎంతో ముఖ్యమన్నారు. నేడు ఉన్నత కోర్సులు చదవాలంటే ప్రతి కోర్సుకు ప్రవేశ పరీక్ష తప్పనిసరి అన్నారు. ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే మంచి కళాశాలలో సీటు సాధించవచ్చని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ శిక్షణకు 70 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. వీరికి ఎపిఆర్‌జెసి సెట్‌కు సంబంధించిన మెటీరియల్, పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టుకు సంబంధించిన 19 టెస్టు పేపర్లతో ఉన్న మెటీరియల్‌ను ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు రాజ్‌కుమార్, మన్మథ, షైనీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అండర్-17 బాలికల రేటింగ్ చెస్ టోర్నమెంట్ పోరంకిలోని గ్రీన్ స్కూల్ నందు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం పోటీలను యన్.ఆర్ స్కూల్ అధినేత ఆర్ యన్ యన్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ శ్రీకాంత్ టోర్నమెంట్‌లో మొదటి ఎత్తు వేసి రెండో రోజు ఆటను ప్రారంభించారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఎ.ఉదయ్‌కుమార్ సమక్షంలో ఆడిట ఆట డ్రాగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 50 మంది బాలికలు పాల్గొంటున్నారని కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ యన్.ఎం.ఫణికుమార్ తెలిపారు. పోటీలలో మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడాకారిణులు పంజాబ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎంపికవుతారని తెలిపారు.

'డయల్ యువర్ సిపి'కి పది ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజాసమస్యలు పరిష్కారం దిశగా "డయల్ యువర్ పోలీసు కమిషనర్" కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ (సిపి) కాంతిరాణా టాటా అన్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 అనే నెంబర్ కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమీషనర్‌కు తెలిపారు. వీటిలో ట్రాఫిక్ సమస్యల గురించి, అసాంఘిక శక్తుల గురించి, కుటుంబ కలహాలుగురించి, ఆర్థిక నేరాలు గురించి, స్థలం తగాదాల గురించి మొదలుగునవి మొత్తం పది కాల్స్ రాగా అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించే దిశగా ఆదేశాలు జారి చేయడం జరిగింది. డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమం ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చేయుటకు, పోలీసుల పట్ల విశ్వాసాన్ని కల్పించుటకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని తెలియజేసారు.

వనరుల దుర్వినియోగంతో దుష్పరిణామాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గుడ్ హ్యాబిట్స్ క్లబ్, గ్రీన్ క్లబ్ మరియు ఎకో క్లబ్ సంయుక్తంగా భూమిపై వివిధ కాలుష్య కారకాల గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణా మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎన్.వి.భాస్కరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు భూ కాలుష్య నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహజ వనరులను విచక్షణారహితంగా దుర్వినియోగం చేయటం వల్ల భావితరాలు దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ప్రమాదం నుండి కాపాడుకోవడానికి యువతరం స్వీయ క్రమశిక్షణ పాటించి కాలుష్య నివారణ పద్ధతులను అవలంబించాలని తమ చుట్టూ ఉన్న సమాజానికి అవగాహన కల్పించడం ద్వారా వనరుల దుర్వినియోగం, మానవ వ్యర్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను అధిగమించవచ్చని సూచించారు. ఈ పరిణామాలను దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం 1986వ సంవత్సరంలో పర్యావరణా పరిరక్షణ చట్టాన్ని అమల్లోకి తీసుకు వచ్చిందని ఈ చట్టం పై కళాశాల మరియు పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాలలో భాగంగా బోధించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా తమ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, పోస్టర్ రూపకల్పన, వ్యర్థ పదార్థాల నుంచి అందమైన ఆకతులను రూపొందించే పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలైన విద్యార్థులకు భాస్కర రావు బహుమతులు అందజేసినట్లు కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు తెలిపారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటడం ద్వారా ప్రోత్సహించవచ్చని కాలుష్య నివారణా చర్యలు విద్యార్థులు అలవర్చుకునేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల క్లబ్బుల సమన్వయకర్త ఐ.వెంకటేశ్వరరావు, గుడ్ హ్యాబిట్స్ క్లబ్ కన్వీనర్ రోహిణి కుసుమ, గ్రీన్ క్లబ్ కన్వీనర్ శ్రావణి, ఎకో క్లబ్ కన్వీనర్ విశాలాక్షి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి హెచ్‌పిసిఎల్ పానీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ వారి స్వతంత్ర్య బ్రాండ్ ' హెచ్‌పి పాని ' ప్యాకేజ్‌డ్ డ్రింకింగ్ వాటర్‌ను సంస్థ జనరల్ మేనేజర్ బి.చంద్రమౌళి ప్రారంభించారు. ఆటోనగర్‌లోని అరుణ ఫిల్లింగ్ స్టేషన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వాటర్‌ను సంస్థ ప్రతినిధులు విడుదల చేశారు. ఈసందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ హెచ్‌పిసిఎల్ వారి అన్ని ఔట్‌లెట్లలోని కస్టమర్ల కోసం డ్రింకింగ్ వాటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. వేసవి సందర్భంగా వినియోగదారుల కోసం స్వచ్ఛమైన త్రాగునీటికి అందించాలనే ఉద్దేశంతోనే ప్రారంభించినట్లు తెలిపారు. విజయవాడ రీజియన్‌లోని అన్ని హెచ్‌పిసిఎల్ ఔట్‌లెట్లలో డ్రింకింగ్ వాటర్ అందుబాటులో ఉంటుందని తెలియచేశారు. ఈకార్యక్రమంలో రిటైల్ విజయవాడ డిజిఎం పమ్మి రవిశంకర్, సీనియర్ మేనేజర్ విష్ణు వర్ధన్, అరుణశ్రీ పెట్రోల్ బంక్ డీలర్ కె.జనార్ధన్‌పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఈట్‌స్ట్రీట్‌లో పొదుపు సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన

మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పక్కన ఉన్న ఈట్ స్ట్రీట్‌లో మెప్మా, విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘాల మహిళలతో తయారు చేయబడిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం కోసం మెప్మా అర్బన్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే మల్లాది.విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పొదుపు సంఘాలకు సున్నా వడ్డీకి రుణాలు, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా ఉందన్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చటమే కాకుండా వారితో వ్యాపార కార్యక్రమాలు చేయించి వారి వ్యాపారాభివద్ధి, మార్కెటింగ్ కోసం మెప్మా అర్బన్ మార్కెట్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. పొదుపు మహిళలకు మార్కెటింగ్ కు అవకాశం కల్పిస్తూ , అటు పట్టణ ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురావడం మంచి శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కె.అనిత, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.శకుంతల, టిఇలు మమత, శేఖర్, సిడిఓ జగదీశ్వరి పాల్గొన్నారు.

ప్లాటినమ్ ఆభరణాలకు ఆదరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్లాటినమ్ ఆభరణాలకు ఆదరణ పెరగడంతో వాటిని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు ప్లాటినమ్ షోరూమ్ ఇన్‌ఛార్జి కె.కరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాటినమ్ లవ్ బ్యాండ్స్, సీజన్ కలక్షన్స్, అరుదైన ప్రేమను తెలియచేసే ఆభరణాలు ఎన్నో ఉన్నాయని తెలియచేశారు. వేసవిలో ప్రత్యేకంగా వెడ్డింగ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కలెక్షన్స్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. అన్ని ప్లాటినమ్ ఆభరణాల షోరూమ్‌లో లభ్యమవుతాయని తెలిపారు.

28, 29 తేదీల్లో రెన్యూఎక్స్ 2023

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

ఈ నెల 28, 29 తేదీలలో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు రెన్యూవబుల్ ఎనర్జీ ట్రేడ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్.ఆర్.రావు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ బి2బి ఎగ్జిబిషన్స్ నిర్వహణా సంస్థ అయిన ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. పునరుత్పాదక ఇంధన కొనుగోలుదారులు, విక్రేతలకు ఒక పరిశ్రమ వేదికను అందచేసే ఉద్దేశంతో ఇది జరుగుతుందన్నారు. వ్యాపార అవకాశాలను సృష్టించేందుకు, వాటిని పరస్పరం అనుసంధానం చేయుటకు ఇది మంచి అవకాశమని తెలిపారు. ఎక్స్‌పోతో పాటు పలు సదస్సులు, సెమినార్లు కూడా జరుగుతాయని తెలిపారు.

హింద్‌వేర్ ఉత్పత్తులకు నూతన ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

బాత్‌రూమ్ సొల్యూషన్స్‌లో అగ్రగామిగా ఉన్న హింద్‌వేర్ సంస్థ ఉత్పత్తులను మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధాన్షు పోలిక్ ఒక ప్రకటనలో తెలిపారు. హింద్‌వేర్ లిమిటెడ్ ఎంతో నాణ్యమైన బాత్‌రూమ్ ఉత్పత్తులును సరసమైన ధరలకు అందిస్తుందన్నారు. క్వాలిటీ విషయంలో రాజీలేకుండా వినియోగదారులకు అవసరాలకు తగతిన విధంగా ఉత్పత్తులను సరఫరా చేస్తుందన్నారు. తమ ఉత్పత్తులను వినియోగదారులకు తెలియజేసేందుకు విస్తృత మార్కెటింగ్ కల్పించేందుకు టెలివిజన్ క్రికెట్ జట్లతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.